కథ

ఆకేశి

శారదా అశోకవర్ధన

వర్షం సన్నగా ఆగకుండా కురుస్తూనే వుంది. దీపస్తంభాల వెలుగు, చీకట్లో మిణుగురుల్లా వున్నాయి ఆ వీధిలో ఆవులమందలో (ఆవులమంద సికింద్రాబాద్‌లోని ఒక వీధి పేరు). ఆరోజుల్లో అక్కడున్నది ఒకే ఒక్కమేడ. ఆ మేడ పక్కనవన్నీ చిన్నాపెద్దా సైజుల్తో వున్న పెంకుటిల్లే. ఆ ఇల్లు మరీను. దాని వయసు కనీసం ప్లాటినం జూబ్లీ దాటుంటుంది. ఆ ఇంటి ఓనరు, పెంటయ్య రెణ్ణెళ్లకొకసారి పెంచే అద్దె కట్టుకోవడం ఎవరికైనా కష్టమే కనుక ఆ యిల్లు ఏడాదిలో సగం రోజులు ఖాళీగానే వుంటుంది. ఇటీవలే ఒచ్చిందొక కుటుంబం ఆ ఇంటికి, పదిమంది పిల్లలతో బిలబిలమంటూ. చెప్పానుగా ఆ వీధిలో వున్నది ఒకే ఒక్క మేడ అని. అది మాదే. మా తాతగారు కట్టిన ఇల్లది. ఆ ఇంటికి కాస్త సున్నం వేయించడానికే మానాన్నకి శక్తి సరిపోయేది కాదు. ఆయన సికింద్రాబాద్‌లోనే ఒక ప్రభుత్వ పాఠశాలలో లెక్కల మాస్టారుగా చేసి రిటైరయ్యారు. మా ఇంట్లో మేము అయిదుగురం మానాన్న సంపాదన మీద ఆధారపడివుండేవాళ్లం. నాకు ముగ్గురక్కయ్యలు. మగపిల్లవాడు లేకపోతే పున్నామనరకం తప్పదనేమో నాలుగవసంతానం కూడా ప్రయత్నిస్తే నేను పుట్టాను. నాన్న జీతం మా చదువులకీ, అక్కయ్యల పెళ్లిళ్లు ఆయన రిటైరయ్యాక రాబోయే గ్రాట్యుటీకి ముందే చేసిన అప్పులకి అయిపోయింది. కాకపోతే లెక్కల మాస్టారవడం వల్ల కాస్త ప్రైవేట్ ట్యూషన్లు రాబడి సంసారంలో వేన్నీళ్లకి చన్నీళ్లుగా తోడ్పడింది. నేను బి.కాం. పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో వున్నాను. మా ఇంట్లో డాబామీద ఒకే ఒక గదుంది. అది నా గదే! నా గది కిటికిలోంచి చూస్తే పెంటయ్యగారి పెంకుటిల్లు కనిపిస్తుంది. అది పాతరకం ఇల్లు కదా లోపల ఒక మండువా. అక్కడే నీళ్ల పంపు. గిన్నెలు కడుక్కోవడానికి మోరీ వున్నాయి. మిగిలిన మూడువైపులా ఒకవైపున వంటఇల్లు, మరో రెండువైపులా గదులూ మరోవైపు ఖాళీగోడా వున్నాయి. ఇంచుమించు ఇల్లంతా ముఖ్యంగా మండువా కనిపిస్తుంది నా గదిలోనుంచి. ఆ ఇంట్లో దిగిన వాళ్లకి మా కిటికీ చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అందుకే చాలా మటుకు ఆ తలుపులు తియ్యను నేను.

అయితే అప్పుడప్పుడు తోచకపోతే తలుపు సందుల్లోంచి కిందకి చూస్తూ వుంటాను. అందులోనూ ఇప్పుడు పదిమంది పిల్లల అలికిడి నాకు చాలా కాలక్షేపంగా వుంది. చిన్న పిల్లల ఆటలూ పోట్లాటలు, పెద్దవాళ్ల మాటలూ చేష్టలూ అన్నీ నాకు సినిమా చూసినట్టుగా వుండేది ఆ కిటికీ సందుల్లోంచి చూస్తుంటే. అయితే ఎవ్వరి మొహాలూ స్పష్టంగా చూళ్లేదు ఇంతవరకు. అందరిలోకీ పెద్దది ఆడపిల్ల. పధ్నాలుగేళ్లుంటాయేమో! అందంగా అమాయకంగా, అల్లరిగా అవ్పుడప్పుడు వోణీ సర్దుకుంటూ హుందాగా అనిపించేది. నాకు తెలీకుండానే నేను ఆ అమ్మాయిని చూడాలని కోరుకునేవాణ్ణి. బహుశః నా పాతికేళ్ల వయసు అట్లాంటిదేమో! ఆ అమ్మాయి కన్న అందరూ చిన్నవాళ్లే. వాళ్లమ్మగారి చేతిలో ఎవ్పుడూ ఆ చివరి సంతానం వుండేది. ఈ అమ్మాయి తల్లికి అన్నిపనుల్లోనూ సాయంచేస్తూనే కనబడేది. ఆ అమ్మాయి పేరు తెలీదు. స్ఫురద్రూపి కనుక, రూప అనుకుందాం. అప్పుడప్పుడూ మోరీ దగ్గర గిన్నెలు తోముతూ, బియ్యం కడుగుతూ, ఆ మండువాలో కూర్చుని కూరలు తరుగుతూ కనబడేది. మరోసారి ఏవో పత్రికలు తిరగేస్తూ కనబడేది. ఒక్కోసారి హోంవర్క్ (ఆ మండువాలో నేలమీద చాపేసి కూర్చుని) చేసుకుంటూ కనబడేది. అప్పుడప్పుడు ఏవో పాటలు పాడుతూ, దువ్విన తలనే దువ్వుకుంటూ వోణీని సవరించుకుంటూ లేడిపిల్లలా ఛెంగుఛెంగున ఎగిరి గంతులేస్తున్నట్టు కనిపించేది. ఒక్కొక్కసారి, దిగాలుపడి కనపించేది. ఇదంతా దూరం నుంచి చూస్తున్న మసకమసకగా కనిపించే చిత్రమే నాకు. వాన వెలిసింది. రాత్రి పదవుతోంది. రేడియో కట్టేసి నిద్రలోకి జారుకున్నాను మెల్లగా. వానతో తడిసిన గాలి వింజామర్లా వీచుతూవుంటే!

000

ఒకరోజు పొద్దుటే ఇంట్లోంచి అరుపులూ, కేకలూ వినబడ్డాయ్. కిటికీ తలుపు కొంచెం తెరిచి చూశాను. అద్దె కోసం పెంటయ్య నానామాటలూ అంటున్నాడు. ఆ ఇంటాయన లోపలున్నాడేమో బయట కనిపించలేదు. ఆ ఇల్లాలు ఏదో చెప్తోంది. కానీ, పెంటయ్య వినిపించు కోవడం లేదు. రూప కూడా ఏదో సర్ది చెప్పబోతోంది ఆరిందలాగా. కానీ, పెంటయ్యగారు ఒక్క కసురు కసిరాడు ఆ పిల్లకేసి చూస్తూ. దాంతో ఆ అమ్మాయి బిక్కచచ్చినట్టు గోడకతుక్కుపోయింది. పెంటయ్య అరిచీ అరిచీ అరగంటసేపు మళ్లా వస్తానంటూ వెళ్లిపోయాడు. అంత పెద్దగా అరవడంవల్ల అతని మాటలన్నీ వినబడ్డాయి నాకు. వాళ్లు నాలుగు నెలల అద్దెబాకీ అట. నాలుగురోజుల్లో ఇవ్వకపోతే సామాను బయట పారేస్తానన్నాడు. వాడు వెళ్లిపోయినా, ఆ కుటుంబం గురించిన ఆలోచనలు నా మెదడులోంచి పోలేదు.

ఎందుకో! వాళ్ల నాదుకోవాలనే ఆరాటం. కానీ, ఎలా? నాకే ఉద్యోగం సద్యోగం లేదు. నేనెలా ఆదుకుంటాను? ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు, మనసు చుట్టూ కందిరీగల్లా ముసురుకుపోయాయి.

ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకి నాకు పౌరసరఫరాల ఆఫీసుకెళ్లి అప్లికేషన్ తెచ్చుకోవలసిన పనుంది. నేను బయటికొస్తుంటే ఆ ఇంట్లోంచి బయటికొస్తున్న మనుషులు కనిపించారు. నలుగురబ్బాయిలు బస్తాడు పుస్తకాలు వెనకేసుకుని బడికెళ్తూ.

"ఏ స్కూలు?" అడిగాను.

"మహబూబ్ కాలేజీ" అన్నారు అందరూ ఏకగ్రీవంగా.

"ఏ క్లాసు?"

"మొదటివాడు ఎనిమిది, తరువాత ఆరు, అయిదు, నాలుగు అన్న కంఠాలు వినిపించాయి. వెనక వచ్చింది రూప. ఒక చెల్లాయినీ, ఒక తమ్ముణ్నీ చేతులు పట్టుకుని.

ఆ రోజుల్లో ఫ్యామిలీ ప్లానింగ్ గురించి చాలామందికి తెలీదు. కానీ తెలివైనవాళ్లు డాక్టరునడిగి కుటుంబాన్ని పరిమితం చేసుకునేవారు.

రూప తమ్ముడూ, చెల్లెలి చేతిలో, విరిగిపోయిన పలకలు చిన్న బలపాలూ వున్నాయి.

"మీపేరేమిటీ?" అని ఆమె నగడలేకపోయాను.

"ఏ బడి కెళుతున్నారు?" అడిగాను రూప చెల్లెలి బుగ్గపై చిటిక వెస్తూ.

"ఈ పక్కనే వున్న సాయి స్కూలు" అంది ఆ చిన్నారి కళ్లు తిప్పుకుంటూ.

'సాయి స్కూలు' అని మా ఇంటికి నాలుగిళ్ల అవతల ఒకావిడ పెట్టింది. అదొక వీధిబడి. ఆ పెట్టినావిడ బహుశః అయిదారుక్లాసులకన్నా చదువుకుని వుండదు. ఫీజు నెలకి మూడు రూపాయలట. మా పనిమనిషి కొడుకు రామిగాడు అక్కడే వెళ్తాడని పనిమనిషి లక్ష్మి అమ్మతో చెప్తుంటే విన్నాను. ఈ పిల్లలు అక్కడికి వెళుతున్నారంటే వాళ్ల ఆర్థిక పరిస్థితి అర్థమైపోయింది. ఆ అమ్మాయి రూప గబగబా వాళ్లను స్కూల్లో దింపి తనూ వెళ్లిపోయింది.

"ఆ అమ్మాయి ఏ స్కూల్?" అడగాలనిపించింది. ధైర్యం చాలలేదు. గబగబ నడచి వెళ్లి బస్‌స్టాండ్ చేరుకున్నాను. పాట్నీ సెంటర్ దగ్గర ఆబిడ్స్ కెళ్లే బస్సెక్కాను.

శ్రావణమాస ముసుర్లేమో? వాన వెలిసి రెండ్రోజులన్నా కాలేదు. మళ్లీ ఒకటే కుంభవర్షం 'కింగ్స్‌వే' (అంటే ఇప్పుడు రాష్ట్రపతిరోడ్డు అని పిలవబడుతున్న రోడ్డు) రోడ్ కిరువైపులా ఉన్న గుల్‌మహార్ చెట్లు (వీటినే కొందరు అగ్నిపూలని కూడా అంటారు).

ఆ రోజు గొడుగు తీసుకెళ్లక పోవడంతో వానలో

ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది కాబోలు. మాట్లాడలేక పోతోంది. గుండె గొంతుకడ్డుపడ్డట్టు క్షణం ఆగింది. "రాజయ్యా... పోనీ, మాకిచ్చాక మిగిలినవి అట్లు తిరిగి అమ్ముకురా... ఈలోగా అయ్యగారొస్తే నీ డబ్బులు నీకిపిస్తాను" అంది ప్రాధేయపడ్తున్నట్టుగా

రాజయ్య విసుక్కుంటూ "ఏమేం కావాలో జెప్పండ్రి" అన్నాడు గిన్నె మూతదీస్తూ. అందరూ ఆ గిన్నెకేసి చూస్తున్నారు ఆత్రుతగా.

తడిసి ముద్దయిపోయాను.

"మరో రెండడుగులు వేశానో లేదో వర్షం మరీ పెద్దదైపోయింది. గత్యంతరంలేక అక్కడ ఒక ఇంటి వరండాలో కెళ్లి తలదాచుకున్నాను. మొహాన వడ్డ నీటిని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ, మళ్లీ కర్చీఫ్‌ను జేబులో పెడుతూ తిరిగి చూసేసరికి నా ముందు నుంచున్నది రూప. పమిటచెంగుతో మొహానవున్న నీటిని తుడుచుకుంటూ. ఆమె ముఖంమీద తిలకం బొట్టు చిరిగి నీళ్లలో కరిగి ఎర్రటి ధారగా ముక్కుమీంచి జారుతోంది నాకు. ఆమె నాకేసి చూసింది. గుర్తుపట్టినట్టు చిరునవ్వు నవ్వీనవ్వనట్టు చూసింది. వెంటనే ధైర్యాన్నంతా కూడగట్టుకుని, "మీరూ బాగా తడిసిపోయారే? వాన బాగా పెద్దగా వచ్చింది" అన్నాను.

"అవును" అంది ముక్తసరిగా.

నాకంకేం మాట్లాడాలో తెలీలేదు. రెండుక్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

"ఇవ్వాళ లేటయిందా?" ఏదో ఒకటి మాట్లాడాలని పిచ్చిప్రశ్న వేశాను.

"అవును. ఇవ్వాళ మా స్కూల్లో స్పోర్ట్స్ డే... ఫంక్షన్ పూర్తయిందో లేదో వానపట్టుకుంది" అంది.'

ఆ కంఠం మోహనరాగంలా అనిపించింది. ఆమె పలికే అక్షరాలు పంచదార చిలకల్లా అనిపించాయి. ఇక ధైర్యం తెచ్చుకుని మాట్లాడడానికి ప్రయత్నించాను.

"ఏ స్కూలు?"

"కీన్... గరల్స్... హైస్కూలు..."

"ఏ క్లాసు?"

"నైన్త్..."

మళ్లీ నిశ్శబ్దం, తన పేరడగాలని అనుకున్నాను. బాగుండదేమోనని "నా పేరు శరత్" అన్నాను, తన పేరు కూడా చెబుతుందేమోనని.

"తెలుసు" అని ఊరుకుంది.

ఆశ్చర్యంగా "ఎలా తెలుసు?" అడిగాను.

"ఒకసారి మీ అమ్మగారు ఏదో మాటల్లో మా అమ్మగారితో చెబుతూవుంటే విన్నాను" అంది.

ఆ అమ్మాయి ధైర్యంగా చక్కగా అలా మాట్లాడుతుంటే నేను నంగిగా మూగిలా ఉండడం నామీద నాకే కోపమొచ్చింది. ధైర్యం చేసి "మీ పేరేమిటి?" అడిగాను.

"వర్షిణి" అంది.

"అదీ అందుకే వర్షంలో తడిసి ముద్దయ్యారు. వర్షిణి ఎంత మంచి పేరు. అమ్మా వర్షిణీ... ఈ వానని కాస్త ఆపకూడదూ?" రెండుచేతులూ జోడించి దండం పెడుతున్నట్టుగా ఆమెకేసి చూస్తూ అన్నాను.

ఆమె పకపకా నవ్వింది.

ఆ నవ్వులో నందివర్ధనాలు పూశాయి!

సెలయేరులు గలగలా పారేయి!

తన్మయత్వంతో ఆమెకేసి చూశాను. ఆమె ఆకాశానికేసి చూస్తోంది.

"వర్షం తగ్గుతున్నట్టుంది" అంది.

"అవును. సన్నగా, తుంపరలు పడుతున్నాయంతే" అన్నాడు.

"ఇక వెళ్లొచ్చేమో" అంది చెయ్యిచాచి అరచేతిలో చినుకులు ఎంత తీవ్రంగా వస్తున్నాయో పరికిస్తూ వర్షిణి.

"పదండి" అంటూ ఆమె అడుగులో అడుగులేస్తూ ఏదో అవ్యక్తమైన గజిబిజి ఊహల ఆనందపు డోలికలో ఊగుతూ సాగిపోతున్నట్టు వింత అనుభూతుల అల్లికలో తేలిపోతూ వెనకే నడిచాను.

ఆ రాత్రి నా పాలిట శివరాత్రే అయింది. వర్షిణి...రూపం, వర్షిణి మాటలూ సర్వం వర్షిణిగా మనసు నిండిపోయింది. జరిగినదంతా మళ్లీమళ్లీ తలుచుకుంటూ ఏ నడిరేయి ఝామునో కళ్లు మూశా నిద్రాదేవిని ఆహ్వానిస్తూ.

000

ఆరోజు సాయంత్రం దాదాపు నాలుగుగంటలు కావస్తోంది. ఎంప్లాయిమెంటు ఆఫీసుకెళ్లి ఒక ప్రదక్షణ చేసి అప్పుడే ఇల్లు చేరుకుంటున్నాను. వర్షిణీ వాళ్ల ఇంటి తలుపులు తెరిచివున్నాయి. లోపలనుంచి గట్టిగా మాటలు వినిపిస్తున్నాయి. సభ్యత కాదని తెలిసి కూడా మెల్లగా తొంగి చూశాను. రాజయ్య... రాజయ్య ఎవరంటే ప్రతీరోజూ సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకి, ఇడ్లీలూ, పచ్చడి, వడా, వంకాయ లేదా మిర్చీ బజ్జీలు వేడి వేడిగా చేసి తీసుకొచ్చి అమ్ముతుంటాడు. ప్రతీవాళ్లూ కొంటారు వాడిదగ్గర. ఎప్పుడోగానీ అతడు తను తెచ్చిన గిన్నెని నిండుగా తీసుకెళ్లడు, ఖాళీ చేసి తప్ప. 'అన్నపూర్ణుడు' అనొచ్చేమో. వర్షిణి వాళ్లింటికి కూడా తరచు వెళుతుంటాడు. ఆ రోజున జరిగిందేమిటంటే, నేను జన్మలో మర్చిపోలేని సంఘటన! భగవద్గీత నాకు జీవితాన్ని గురించి ఉపదేశించిన సంఘటన!

"నేనియ్యాల ఒక్క రూపాయికూడా అప్పియ్యనమ్మా... నా పైసలు, అదివరకటి బాకీ నా మొఖానబడెయ్యి. ఇయ్యన్ని అమ్ముకొని ఇంటికి బోవాల" ఖచ్చితంగా చెప్తున్నాడు వాడు.

"బాబూ... ఇవ్వాళ పిల్లలు పొద్దుటి నుంచీ ఏమీ తినలేదు. నీకు పుణ్యముంటుంది. పచ్చిమంచినీళ్లు తాగి స్కూలుకెళ్లారు. ఆకలిమీదున్నారు. నీ డబ్బులెక్కడికీ పోవు. రెండుమూడు రోజుల్లో నీ బాకీ మొత్తం ఇచ్చేస్తాను" ఆమె మరీ మరీ బతిమాలుతోంది దీనంగా.

"లేదమ్మా...నేనియ్యాల ఉద్దెరియ్యను. ఉద్దెరిస్తే ఇయ్యన్నీ మీరే దినెటట్టున్నారు! గిన్నె ఖాళీ చేసి సేతులూ వూపుకుంట ఇంటికి పోతే రేపెం బెట్టి మల్ల ఇయ్యన్ని తయ్యారు జెయ్యాల? నీకాలు మొక్కుత! నాపాత బాకీ కూడా బడెయ్" వాడు గట్టిగా మరింత ఖచ్చితంగా చెప్తున్నాడు.

ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది కాబోలు. మాట్లాడలేక పోతోంది. గుండె

జబ్బులతో మస్తిష్కానికి ఇబ్బంది

జబ్బులతో శరీరానికే కాక మెదడుకూ సమస్యలొస్తాయంటున్నారు డాక్టర్లు. దాదాపు 11,000 మంది

47 నుంచి 70 ఏళ్ల వయసు గల వారిని పరిశీలించి పరిశోధించి తేల్చినదేమిటంటే... మధుమేహం, రక్తపుపోట్ల ప్రభావం మెదడు మీదా పడుతుందట. జబ్బులున్న వారి కంటే లేని వారి మెదడులో ఇబ్బంది తక్కువగా వుందంటున్నారు. వాస్కులర్ రోగాలున్న వారికి కూడా ఈ జబ్బుల వల్ల రక్తవాహినులు మూసుకుపోతాయట. కనుక మధుమేహం, హై బీపీ గలవారు, ప్రారంభదశలోనే చికిత్స చేయించుకోవటం వల్ల మెదడుకు ఎటువంటి హానీ కలగకుండా వుంటుంది.

ఎన్.

గొంతుకడ్డుపడ్డట్టు క్షణం ఆగింది.

"రాజయ్యా... పోనీ, మాకిచ్చాక మిగిలినవి అట్లు తిరిగి అమ్ముకురా... ఈలోగా అయ్యగారొస్తే నీ డబ్బులు నీకిప్పిస్తాను" అంది ప్రాధేయపడ్డున్నట్టుగా.

రాజయ్య విసుక్కుంటూ "ఏమేం కావాలో జెప్పండ్రి" అన్నాడు గిన్నె మూతదీస్తూ.

అందరూ ఆ గిన్నెకేసి చూస్తున్నారు ఆత్రుతగా.

"ముందు అందరికీ రెండేసి ఇడ్లీలు పెట్టు" అంది ఆమె.

వాడు బాదంఆకులు తీసి రెండేసి ఇడ్లీలు, చట్నీవేసి ఇస్తూవుంటే, వర్షిణీతో సహా ఒక్కొక్కళ్లే వొచ్చి, తీసుకుని ఆవురావురుమని తింటున్నారు. ఆమెకూడా పిల్లలతో పాటు ఆత్రంగా తినడం నా గుండె తరుక్కుపోయింది. రెండు ఇడ్లీలూ రెండు క్షణాల్లో తినేశారు. "ఇప్పుడేం గావాలా?" రాజయ్య గొంతు.

ఒకరు వడ, ఒకరు వంకాయ బజ్జీ... ఇలా అందరూ ఏవో ఏవో ఎవరిక్కావలసినవి వాళ్లు తిన్నారు లొట్టలేసుకుంటూ. 'ఆకలి రుచెరగదు' అంటారు. అది అక్షరాలా నిజం. ఆ క్షణంలో వారికేమిచ్చినా మాకొద్దు... మాకివ్వే కావాలి అన్నంత ఆబగా తిని హాయిగా నీళ్లు తాగి త్రేన్పడం చూస్తే, నా గుండెని ఎవరో కత్తితో కోసినట్టనిపించింది. ఎన్నిసార్లు నేను నాకు తెలీకుండా ఆకలి లేదంటూ సగం టిఫిను వదిలేసి ప్లేటులో చెయ్యి కడుక్కుని వెళ్లానో తలచుకుంటే సిగ్గేసింది. కొంచెం వంగి ఇంట్లోకి చూశాను. ఇల్లాలి మొహం చూసేసరికి, ఏదో జ్ఞాపకం మనసులో లీలగా మెదిలింది. ఆలోచిస్తూనే నుంచున్న నేను రాజయ్య బయటికి రావడం చూసి కాస్త పక్కకు జరిగి "రాజయ్యా" అని పిలిచాను. వాడు "అయ్యా" అంటూ ఆశగా వొచ్చాడు క్షణంలో. "వాళ్లు ఎంత డబ్బివ్వాలి?" అడిగాను.

"ఇయ్యాల ఇరువైరెండు, నిన్న పద్దెనిమిది. మొన్నటియి పన్నెండు మొత్తం యాభైరెండు" అన్నాడు మరోసారి లెక్కలు జూసుకుంటూ. వెంటనే జేబులోంచి డబ్బులు తీసి యాభైరెండు రూపాయలూ రాజయ్య చేతిలో పెట్టి, "తీసుకో వాళ్ల బాకీ, ఇంక వాళ్లని డబ్బడగకు" అన్నాను.

వాడు నాకేసి ఆశ్చర్యంగా చూశడు. "నేను వాళ్లకి డబ్బివ్వాలిలే. నేనూ వాళ్లూ లెక్కలు తరవాత చూసుకుంటాం గానీ, ఈ సారి నుంచి వాళ్లతో డబ్బు దగ్గర పేచీ పడకు" చెప్పాను.



వాడు నావైపు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ దండంపెట్టి, "మీకేం వొద్దా దొరా?" అడిగాడు.

"ఒద్దు రాజయ్యా... ఇప్పుడే ఒస్తూ ఒస్తూ ఆకలిగా అనిపిస్తే ఆనంద్‌భవన్‌లో టిఫిన్ చేసి ఒస్తున్నా" అన్నాడు.

"కొలువు దొరికిందా దొరా?" అడిగాడు.

"లేదు రాజయ్యా... ఇంకా లేదు" అన్నాను.

బాధపడుతూ, "మాలాంటోళ్లని నూసి మీకు సదువుల్లేవు, అందుకే ఏ కొలువుకు పనికిరారు అనేవోరు. మరిప్పుడు సదువుకున్నా కొలువుల్లేవంటున్నారు. ఈ లోకంలో ఏందో తెలుస్తలేదు" అన్నాడు తత్వవేత్తలాగా, గిన్నె తలపైన పెట్టుకుంటూ.

పోతూ పోతూ నావైపు తిరిగి "బాబూ! ఆ ఇంటోల్లని సుత్తావుంటే గోసనిపిస్తది. ఇంట్లో వంటసేసుకున్నట్టు కనబడరు దొరా... పిల్లలా పుట్టెడుమంది. అందరూ బుద్ధిమంతులే. తిన్నా తినకున్నా పుస్తకాలు దీసుకొని ఎప్పుడు నూసినా సదువుకుంటా కండ్లబడతరు. ఆ పెద్దబిడ్డ ఆడిపిల్లైనా మొగోడితో సమానం. అన్ని పన్లు జేస్తది. బజారుపన్లు, తల్లికిసాయం అన్ని జేస్తది. ఆ తల్లి సత్తెకాలపు మనిషి. కడుపునిండ కనుకున్నది గానిలోకం దెలవదు. అందుకనె ఎన్నడు అల్లకి ఉద్దెరియ్యనని అనను. కాకుంటె జర బెదిరిస్త అంతే" అన్నాడు నవ్వుతూ రాజయ్య.

నాకు రాజయ్య మాటలు వింటుంటే, అతని పరిశీలనా శక్తికీ, అతని సహృదయతకీ మనసు ఉప్పొంగిపోయింది. గొప్ప మేధవి, మహర్షిలా అనిపించాడు.

"నువ్వు చాలా మంచివాడివి రాజయ్యా..." అన్నాను అప్రయత్నంగా.

"బాబూ మీరు మాత్రం? మా మాటలిన్నారు. అల్లమీద జాలిబడి, మీరు అల్లకి బాకీ ఉన్నారని సెప్పి, ఈ డబ్బులు నాకిచ్చి నన్నూ ఆదుకున్నారు, అల్లనీ ఆదుకున్నారు. నాకు తెల్వదా ఏంటి? లేకపోతే మీరు అల్లదగ్గర డబ్బులు తీసుకోవడమేందీ? మీది బంగారంలాంటి మనసు. బగవంతుడు జల్ది మీకు కొలువిప్పియ్యాల" అని ఆశీర్వదిస్తూ వెళ్లిపోయాడు, నేను ఆశ్చర్యంలో నుంచి కోలుకునే లోపలే.

'రాజయ్య లాంటి వాళ్లకి చదువూ డబ్బూ వుంటే, బంగారానికి మెరుగు పూసినట్టుండదూ? ఇలాంటివాళ్లు రాజకీయాల్లో వుంటే ఎంతమందికి ఉపయోగపడతారో? దేశం ఎంత బాగుపడుతుందో? అనుకుంటూ నాలో నేను నవ్వుకున్నాను. ఎందుకంటే 'ఇటువంటి వాళ్లు రాజకీయాల్లోకి ఎలా వస్తారు? వచ్చినా బతగ్గలరా? ఒద్దు... రాజయ్యలాంటివాళ్లు ఇలా వుంటేనే పదిమందికి పనికొచ్చె పన్లు చెయ్యగలుగుతారు?' అనుకుంటూ నా పిచ్చి పిచ్చి ఊహలని అదుపులో పెట్టి, మా ఇంటి గుమ్మం చేరుకున్నాను. నా గదిలోకెళ్లి చెప్పులు మార్చుకుని వెంటనే కిటికీలోంచి కిందికి చూశాను. ఇల్లాలు తృప్తిగా ఒళ్లో వున్న బాబుతో, ఏవో కబుర్లు చెబుతూ ఆడిస్తోంది. తల్లిప్రేమంటే ఇదే... బిడ్డల ఆకలి తీరిందనగానే, కాస్త తనూ ఆత్మారాముణ్ణి శాంతింపజేసి, ప్రపంచాన్ని జయించినంత తృప్తిగ, పొత్తిళ్లలోని బాబుతో ఆడుకుంటోంది. ఆమెకి ఆ ఇల్లే స్వర్గం... పిల్లలే దేముళ్లు. అంతకంటే కోవెల మరొకటుందా? ఆమెకేసి తదేకంగా చూశాను... మళ్లీ మళ్లీ చూశాను. పావలా కాసంత బొట్టు, ఒక్క పసుపుతాడు తప్ప ఏ ఆభరణాలూ లేని బోసిమెడ, చేతులకి మట్టిగాజులూ, మామూలు చీర.... అయినా ఆమె మొహంలో ఏదో కళ... ఆలోచిస్తు చూస్తున్న నాకు... ఠక్కున ఏదో గుర్తొచ్చింది. మనసు ఆవేశంగా ఆలోచించడం మొదలెట్టింది. సరిగ్గా పదిపన్నెండేళ్ల క్రితం...

000

బోయినపల్లిలో ఒక పెద్ద యిల్లు. ఇంటికన్నా పెద్ద తోట. ఆ తోట నిండా, క్రోటన్లూ, పూలచెట్లు, పళ్ల చెట్లు, కూరగాయల చెట్లు, ఒక చిన్న పబ్లిక్ గార్డెన్‌లా వుండేది. ఆ తోట చూడ్డానికో గంట పట్టేది ఆ ఇంటికి వెళ్లినవాళ్లకి. ఇక ఆ యిల్లు ఆ రోజుల్లోనే అద్దాల అలమారలు, అద్దాల కిటికీలు, రంగురంగుల్లో ఆకర్షణీయంగ వుండేవి. పెద్దపెద్ద గదులూ,

చలి పులికి ఆహారం!

చలికాలంలో. పచ్చి గాజర్ దుంపలను బాగా నమిలి తినాలి. గాజర్ రసం కూడా తాగాలి. పాలు, గాజర్, పంచదార కలిపి మరిగించి పాయసం చేసి తీసుకోవాలి.

మొలకెత్తిన గోధుమలు, పప్పు ధాన్యాలను సలాడ్లు చేసి, భోజనానికి ముందు తీసుకుంటుండాలి. సలాడ్లను రుచికరం చేసుకునేందుకు వాటిలో ఖీరాలు, టొమాటోలు, ఉడికించిన ఆలుగడ్డలు, ఉప్పు, నిమ్మరసం, కొత్తిమీర, పచ్చిమిర్చి కలుపుకోవచ్చు.

విటమిన్-సి ఎక్కువగా వున్న ఉసిరికాయలను ఎలా తీసుకున్నా ఆరోగ్యమే. విటమిన్-సి ఎక్కువగా వుండటం వల్ల శరీరంలోని రోగనిరోధకశక్తి పెరుగుతుంది. అందుకే చలికాలంలో ఉసిరికాయల పచ్చళ్లను పెడుతుంటారు పెద్దలు.

సోంఫ్ గింజలను, కలకండ పలుకులతో కలిపి బరకగా పొడి చేసుకుని సీసాలో వుంచుకోవాలి. రోజూ ఈ పొడిని ఒక స్పూను చొప్పున పాలు లేదా నీటితో కలిపి తీసుకోవాలి.

ఇవే కాకుండా మిరియాలు, అక్రోట్లు తీసుకోవటం కూడా మంచిది. వీటి వల్ల టెన్షన్ తగ్గుతుంది.

ఎస్.

గదులకు తగ్గ రోజ్‌వుడ్ ఫర్నిచరూ ఆ ఇల్లు చూడగానే 'ఎవరో? ఆగర్భ శ్రీమంతుల ఇల్లు' అనిపిస్తుంది ఎవరికైనా.

ఆ ఇంట్లో వుండేవారు ఆనందరావుగారు. ఒకసారి నాన్నగారికెందుకో అర్జంటుగా వెయ్యిరూపాయలు కావలసి వొచ్చాయి. ఆ... మూడో అక్కయ్య సారిక పెళ్లిలో. నాన్నగారు నన్ను ఆనందరావుగారింటికి పంపించారు. అది మధ్యాహ్నం సమయం. ఒంటిగంట కావొస్తుంది. ఆనందరావుగారూ అతని బావమరిది (రఘునాథ్ అని పరిచయం చేసారు అక్కడేవుండి చదువుకుంటున్నాట్ట) పిల్లలు (ఒకరిద్దరే వున్నారు అప్పుడు) ఇంకా ఎవరెవరో బంధువులూ అందరూ భోజనానికి కూర్చున్నారు. లోపల వంట చేస్తున్నది ఆనందరావుగారి అత్తగారు. భార్య సౌభాగ్యమ్మ వడ్డిస్తోంది. నన్ను చూడగానే ఆనందరావుగారు "శరత్... రా రా... భోం చేద్దువుగాని" అన్నారు.

"ఒద్దండీ" అన్నాను.

"ఫరవాలేదు రావోయ్... సౌభాగ్యం... శరత్‌కికూడా కంచంపెట్టి వడ్డించు" అన్నారు.

"నేను భోంచేసి వచ్చానండి" అన్నాను సిగ్గుపడుతూ.

"శరత్... ఇవ్వాళ మా యింట్లో మెనూ ఏమిటో తెలుసా? నేతిగారెలూ, అల్లప్పచ్చడి, పనసపట్టు కూరా... ములక్కాడ సాంబారూ... మా అత్తగారు స్వయంగా చేసిన చంద్రకాంతాలు. చంద్రకాంతాలెప్పుడైనా తిన్నవా? చాలా బాగుంటాయి... రా..." అంటుండగానే సౌభాగ్యమ్మగారు పీట వెయ్యడం, వళ్లెం పెట్టడం, వడ్డించడం అన్నీ అయిపోయాయి. పీటమీద నాలుగువైపులా చిన్నచిన్న వెండిపూలూ అతికించినట్టున్నాయి. వెండి కంచం, వెండిగ్లాసు, కంచంలో పదార్థాలూ అన్నీ ఆకర్షణీయంగా వుండడమే కాక, నోరూరించే సువాసనలు గుప్పుమంటున్నాయి.

కొసరి కొసరి సౌభాగ్యమ్మగారు వడ్డిస్తూ వుంటే, నాకు తెలీకుండానే నేను పొట్ట పగిలేంత తినేశాను. భోజనాలయ్యాక ఆనందరావుగారు డబ్బిచ్చారు. సౌభాగ్యమ్మగారు వడ్డిస్తుంటే సాక్షాత్తూ లక్ష్మీదేవి పాలసముద్రం మధ్యలో నుంచి వచ్చి, అమృతం వడ్డిస్తున్న మోహినిలా అనిపించింది. రెండు చేతులకీ సగం మోచేతివరకూ ధగధగా మెరిసే గాజులూ, మెడనిండా గొలుసులూ, నడుంకి వడ్డాణం, సొగసైన రూపం, రూపానికి తగ్గ ఆప్యాయత ఆమెకి మరో ఆభరణంలా అనిపించింది. ఆమె పక్కన ఆనందరావుగారు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడిలా అనిపించారు. బహుశః వర్షిణే కావచ్చు. రెండు మూడేళ్ల పిల్ల. బొద్దుగ, తెల్లగా వుంది. బాగా జ్ఞాపకం ఎర్రటి పూలవ ాలగౌను వేసుకుని, కాళ్లకి గజ్జెలు, చెవులకి లోలక్కులూ, గలగలా మాట్లాడుతూ ఏవో కబుర్లు చెబుతూ వాళ్ల నాన్నని అంటిపెట్టుకునే వుంది! ఏమిటి? ఎందుకింత మార్పు? అటువంటి ఆనందరావుగారెందుకింత దరిద్రంలో వున్నారు? నాన్నగారుంటే తెలిసేది. అమ్మకేమీ తెలీదు" అనుకుంటూనే అమ్మనడిగాను.

"అమ్మా! పెంటయ్య ఇంట్లో అద్దెకున్నవాళ్లు ఆనందరావుగారేనా? " అని. "అవును బాబూ! వ్యాపారంలో మోసం చేశారు, స్నేహితులుగా వున్న కొందరు. దాంతో ఆనందరావుగారు వ్యాపారం చెయ్యడం మానేశారు. సంపాదన పోయింది. సంసారం పెరిగింది. అతనికింద పనిచేసిన గుమాస్తాలే శ్రీమంతులైపోయారు."

"ఇప్పుడాయన ఏం చేస్తున్నారు?"

"ఏమీ లేదు"

"మరి... ఇల్లెలా గడుస్తోంది"

"ఏముందీ... ఆ రోజుల్లో ఆయన దగ్గర సహాయం పొందినవాళ్లు ఎవరో ఒకరు అడక్కుండానే ఏదో రూపంలో సహాయం చేస్తున్నారు"

"ఎంత చేస్తే మాత్రం... అంత పెద్దకుటుంబం గడిచేదెట్లా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అదే కదా బాబూ! వాళ్ల బాధలు ఆ భగవంతుడికే తెలును. వాళ్లందరికీ ఆత్మాభిమానం ఎక్కువ. తనకింద పనిచేసిన వాళ్ల దగ్గర తను పని చెయ్యలేనని ఆనందరావుగారి బాధ... ఆ పిల్లలు ఆకలికి నీళ్లు తాగి కడుపు నింపుకుని ఫస్టుగా చదువుతున్నారు. అందరికీ స్కాలర్‌షిప్పులొస్తున్నాయి. ఎవరో ఒకరు పుస్తకాలు ఫ్రీగా ఇప్పిస్తున్నారు"

అమ్మ చెబుతూ వుంది. నా ఆలోచనలు సుళ్లు తిరుగుతూ వున్నాయి. "అమ్మా! పెద్దమ్మాయి పెళ్లికొస్తోంది. ఇలా అయితే ఎలా?" ఏదో నసిగాను.

"ఆ అమ్మయి ఆలోచనలు పెళ్లి మీద లేవు బాబూ. ఇంకొక్క ఏడాది చదివి, మెట్రిక్ అయ్యాక ఏదో ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించాలని ఆమె ఆశయం, ఆందోళన. ఇప్పటికే, స్కూలు టైమ్ అయ్యాక, రెండు మూడూ ట్యూషన్లు చెబుతోంది. దాదాపు వందరూపాయుల సంపాదిస్తోంది. అందుకే యాభైరూపాయల అద్దెకి ఈ ఇల్లు తీసుకున్నారు" ఇంక చెప్పే మాటలు నా చెవిన పడడం లేదు. 'అయ్యో ఆడపిల్లా?' అనేవాళ్ల నోళ్లకి తాళం వేసింది వర్షిణి. ఆమె ఆశయం, ఆప్యాయతా గొప్పవి. ఏనాటికైనా ఆమెకి ఉజ్వల భవిష్యత్తు వుంది' మనసులో అనుకున్నట్టుగా పైకే అనేశాను.

"అవునురా" అంది అమ్మ.

000

ఆగర్భశ్రీమంతురాలూ, ప్రతివారీ ఆకలి తీర్చే సాక్షాత్తూ అన్నపూర్ణమ్మ, ఆ సౌభాగ్యమ్మ గారు, పనివాళ్లకి కూడా నేతిగారెలు వడ్డించడం కళ్లారా చూసిననేను, రాజయ్య గారెల కోసం ఇడ్లీల కోసం ప్రాధేయపడడం, పదే పదే జ్ఞాపకం వచ్చి నాగుండె ముక్కలయిపోతోంది. వాళ్లకెలా సహాయం చెయ్యాలి? ఇవే నా ఆలోచనలు. ఈ ఆలోచనల తోటే వారం రోజులు గడిచి పోయాయి. ఆ రోజు నాకు ఉద్యోగం వచ్చిందని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరు నుంచొచ్చిన టెలిగ్రాం నన్నెంతో ఆనందంలో ముంచెత్తింది. వెంటనే వచ్చి బెంగుళూరులో జాయినవ్వమని వుంది. సరే వెళ్లిపోయాను. వెళ్లేముందు వర్షిణి కనిపించలేదు. ఇంటికి వెళ్లి చెప్పే ధైర్యమూ, చనువూ నాలో లేదు. సరే! ఒచ్చాక కలుద్దాంలే అని బెంగుళూరు వెళ్లిపోయాను.

దాదాపు నెల రోజుల తర్వాత తిరిగొచ్చిన నాకు, పెంటయ్య ఇంటికి వేళ్లాడుతున్న తాళం నన్ను వెక్కిరిస్తూ కనిపించింది. అమ్మ చెప్పింది. పెంటయ్య సామాను బయటపడేస్తాని అని బెదిరిస్తే రాత్రికి రాత్రి వాళ్లు ఎవరో స్నేహితులింటికి వెళ్లపోయారని! నా మనసు ఉద్రేకంతో ఊగిపోయింది. పెంటయ్యని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. వర్షిణి కుటుంబం ఎక్కడున్నా ఆదుకోవాలన్నంత ఆవేశం ముంచుకొచ్చింది. కానీ ఎలా? ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో నిట్టూర్చాను.

000

కాలచక్రంలో మరో పది క్యాలెండర్లు మారాయి. నేనిప్పుడు ఇద్దరు పిల్లల తండ్రిని. మా పెద్దమ్మాయికి వర్షిణి అని పేరు పెట్టాను. ఒకరోజు అమ్మ చెప్పింది. "ఒరేయ్ శరత్. నీకు తెలుసా? వర్షిణి ఇప్పుడు పెద్ద ఆఫీసరట. అదేదో ఆఫీసు పేరు చెప్పారు. తమ్ముళ్లందర్నీ బాగా చదివించిందట. వాళ్లందరూ మంచి మంచి ఉద్యోగాలు చేస్తున్నారట. అందరికీ మంచి సంబంధాలొచ్చి పెళ్లీ పేరంటాలు అన్నీ జరిగాయట. సౌభాగ్యమ్మ సౌభాగ్యం మళ్లీ తిరిగొచ్చింది." అంది అమ్మ. ఆ మాటలు నా గుండెలో అమృత వర్షం కురిపించాయి. "నాకు తెలుసమ్మా వర్షిణి పట్టుదల' అని మాత్రం అన్నాను. వాళ్లిప్పుడు ఎక్కడున్నారో మళ్లీ వాళ్లందర్నీ చూడగలుగుతానో లేదో ఆలోచిస్తూ... ఎందుకంటే... నాకు ఫారిన్ పోస్టింగ్ వచ్చింది.

ఎక్కడున్నా ఎప్పుడైనా వర్షిణి కుటుంబం కళ్లకి కట్టినట్టే హృదయ కవాటంలో స్థిరంగా తిష్ట వేసుకునుండటం వల్ల ఎప్పుడూ వాళ్లు నా దగ్గరున్నట్టే అనిపిస్తుంది. అందుకే ఆరోజు సౌభాగ్యమ్మగారు వడ్డించిన తీరూ, రాజయ్య టిఫిను కోసం అభ్యర్థించిన తీరూ నాలో చెరగని ముద్ర వేసి ఆకలి ఎటువంటిదో, ఆ బాధ ఎటువంటిదో, ఆకలిలోంచి ఎటు వంటి నిర్ణయాలు పుడతాయో వర్షిణి కుటుంబం నాకాదర్శంగా వుండి 'ఆకలి' అన్నవాళ్లకి అన్నం పెట్టేలా చేసింది నన్ను. ఆకలి బాధ అంతా ఇంతా కాదు. 'కోటి విద్యలు కూటి కొరకే' అయితే, మనం వేసుకునే బాట ఉన్నతమైనది కావాలి. ఆకలిబాధ తాళలేక అనర్థదాయకమైన పన్లు చెయ్యకూడదు. ఈ మాటలే మా చిట్టివర్షిణికి చెప్తూ వుంటాను ఎప్పుడూ!

(ఈ దేశంలో ఆకలిబాధ పడుతున్న పౌరులందరికీ ఈ నాకథ అంకితం)

■

ముప్ఫయ్యేళ్ల తరువాత ప్రసవం కష్టమా?

ముసుపైతే ఆడపిల్లలకు పదహారేళ్లకు పెళ్లి చేసి, ఇరవయ్యేళ్లకల్లా నలుగురైదుగురు పిల్లలకు తల్లులై చూసి ఆనందించేవారు మన పెద్దలు. నేడు కెరీర్ మైండెడ్ వుమనైపోయిన మహిళలు పిల్లలను చిన్నవయసులో వద్దనుకుంటున్నారు. ముప్పయి ఏళ్లకు తల్లులైతే వారికీ, ఇరవయ్యేళ్లకు తల్లులైన వారికీ పెద్దగా సమస్యలేమీ వుండవంటున్నారు డాక్టర్లు. ముప్ఫైయ్యేదేళ్ల తరువాతే సమస్యలు వస్తాయి. ముప్ఫయ్యేళ్ల తరువాత తల్లులయ్యే స్త్రీలకు క్రోమోజోముల్లో తేడాలు వచ్చి రక్తస్రావం, గర్భపాతం వంటివి జరిగే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. పైగా వయస్సు మీరటం వల్ల నార్మల్ డెలివరీ కాక సిజేరియన్ చేసే ఆవశ్యకత కూడా పెరుగుతుంది. అందువల్ల ఎంత కెరీర్ కావాలనుకున్నా, జీవితం ఒక రకమైన కెరీరే కనుక, అందులోనూ సాధించదలచుకున్నవి వుండాలి కనుక ముప్ఫయ్యేళ్ల లోపునే తల్లులు కావటం ఉత్తమోత్తమం అంటున్నారు వైద్యనిపుణులు.

ఎస్.